ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 03 నవంబరు , 2026 | పేజీలు : 7

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి పోరాటం

99 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఢిల్లీకి



ప్రజాపక్షం/మూటకొండూరు: ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో బీర్ల అయిలయ్య పాల్గొని, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటమే లక్ష్యంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఓట్ చోర్ దేశ్ బచావో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొనేందుకు ఆలేరు నియోజకవర్గం నుంచి సుమారు 99 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన ఇండియా కూటమి భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి

వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చి పంటలకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



ప్రజాపక్షం/మునుగోడు: కరువు కోరల్లో చిక్కుకుని తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మునుగోడు మండలంలోని చలిమెడ గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను వారు పరిశీలించారు.గ్రామానికి చెందిన కౌలు రైతు కత్తుల మల్లయ్య ఐదు ఎకరాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించి,ఆయనకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతు మల్లయ్య మాట్లాడుతూ ఎకరానికి రూ.10 వేల చొప్పున ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని రెండు ఎకరాల్లో వరి,మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశానని తెలిపారు.రెండు ఎకరాల్లో వరి పూర్తిగా ఎండిపోయిందని, పత్తి పంటకు ఎకరానికి రెండు గంటల చొప్పున నీరు అందించినప్పటికీ మూడు ఎకరాల్లో కలిపి కేవలం ఆరు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగు కోసం సుమారు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయానని వివరించారు.

అనంతరం పల్లా వెంకటరెడ్డి,నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మండలంలో ఎండిపోయిన పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని కోరారు. వరి పంటకు ఎకరానికి రూ.30 వేలు, వాణిజ్య పంటలైన పత్తి, మిర్చికి ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించి,తక్షణ ఉపశమనం అందించాలని సూచించారు.డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే మునుగోడు ప్రాంతంలో ఈ స్థాయిలో కరువు పరిస్థితులు ఏర్పడేవి కావని పేర్కొన్నారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కరువు సహాయక చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మునుగోడు మండలంలో మొత్తం 5,342 ఎకరాల్లో వరి, 36,923 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, చలిమెడ గ్రామంలో 70 ఎకరాల్లో వరి,1,680 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పురి వెంకటేశ్వర్లు, బి. లాలయ్య,మండల కార్యదర్శి చాపల శ్రీను,మాజీ జెడ్పీటీసీ గోస్కుండ లింగయ్య,చల్మేడ సర్పంచ్ బండమీది యాదయ్య,ఈదులకంటి కైలాష్,కట్ట దశరథ,కట్కూరి లింగస్వామి,గోపగోని ఉదయ్, రైతులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల పూర్తయితేనే

మునుగోడు,దేవరకొండ శాశ్వత పరిష్కారం

ఎల్‌నినో కరువును ఎదుర్కొనేందుకు సమష్టిగా పనిచేద్దాం

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి.. కౌలు రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/మునుగోడు: మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాల్లో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులకు డిండి ఎత్తిపోతల పథకం పూర్తికావడమే శాశ్వత పరిష్కారమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లు స్పష్టం చేశారు.నియోజకవర్గంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి తాగు,సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు,ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్‌జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, నల్లగొండ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం,కరువు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి అవగాహన సదస్సులో వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.మునుగోడు నియోజకవర్గంలో దాదాపు 80 శాతం మంది రైతులు పత్తి సాగుపైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో పత్తి దిగుబడులు తీవ్రంగా పడిపోయాయని,ఎకరాకు ఒకటి, రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్‌నినోను జాతీయ విపత్తుగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, మునుగోడు,దేవరకొండ ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డిండి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. డిండి ఎత్తిపోతల పథకం విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులను ఒప్పించి నీటిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.ఈ పథకం పూర్తయితే మునుగోడు,దేవరకొండ ప్రాంతాల్లో కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి,డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి,యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్,ఇతర మున్సిపల్ చైర్మన్లు,వైస్ చైర్మన్లు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం యాదాద్రిభువనగిరి కేంద్రంలోని స్వర్ణగిరి దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళ భరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు శ్రీవారినీ దర్శించుకున్న అనంతరం స్వామివారి నిత్యఅన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా మహాసభలు

ప్రజాపక్షం/రామన్నపేట: కళాకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నవంబర్ 4వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆర్టిస్ట్ అసోసియేషన్ యూనియన్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లోజు సోమ నరసింహచారి సోమవారం తెలిపారు. ఈ మహాసభలను జిల్లాలోని కళాకారులం దరూ ఏకమై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో ఆర్టిస్ట్ రంగానికి చెందిన కళాకారులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సవాళ్లపై ఈ మహాసభలలో కూలంకషంగా చర్చిస్తామని పేర్కొన్నారు. కళాకారుల ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమల్లో జరుగుతున్న ఆలస్యం, భవిష్యత్ కార్యాచరణ వంటి కీలక అంశాలపై స్పష్టమైన అవగాహనకు రానున్నట్లు తెలిపారు.

మర మగ్గాల కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

**ప్రజాపక్షం/చిట్యాలఃఃః



ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎల్‌హెచ్‌డిసిపి అస్కాడ్ కార్యక్రమంలో భాగంగా ఆవు, గెదే, దూడ లకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్య క్రమాన్ని సోమవారం మండల పరిధిలోని పెంచికల్ దిన్నె గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా వాటి ఎదుగు దల, ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పశువులు ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రైతులు లింగయ్య, గంటా నాగరాజు, వైద్య సిబ్బంది స్వప్న పాల్గొన్నారు.

ఆశీర్వదించాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులం దరూ ఆశీర్వదించి జనసేన పార్టీ తరుపున పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జన సేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు కోరారు. సోమ వారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జన సేన పార్టీ బలంగా ఉందని, ఇకనుండి తెలంగాణలో జరిగే ప్రతి ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. అదే విధంగా త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్ని కల్లో పట్టభద్రులు జనసేన పార్టీకి ఓట్లు వేసి నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పిఏసి లు గాజుబోయిన సైదులుయాదవ్, షేక్ హసన్‌మియా, అందె శ్రీను, సరికొప్పుల నాగేశ్వర రావు, మండల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు శంఖుస్థాపన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: మండలంలోని ఇంద్రియాల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పను లకు ఆగ్రామ సర్పంచ్ ధీరావత్ వెంకటేశ్ సోమవారం శంఖుస్థాపన చేసారు.ఆర్థిక సంఘం నిధుల నుండి చేపట్టనున్న ఈ పనులు కమలా నగర్ కాలనీ ధీరావత్ రవి ఇంటి నుండి చెవ్వగోని నర్సింహ్మ ఇంటి వరకు సాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపస ర్పంచ్ రేవల్లి అశోక్,మేకల లావణ్యచ జంగా రెడ్డి,కుమ్మరి బుచ్చిబాబు,మొగిలిపాక గోపాల్,అనిత సుధాకర్,దొడ్డి సుధాకర్,మాజి ఎంపిటిసి ఎదునోజు రాజనారాయణ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమానికి బహుజన సమాజం సిద్ధం

ప్రజాపక్ష/నల్లగొండ టౌన్ :కేంద్ర జనగణనలో బీసీ కులగణన ఉండాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమా నికి సమస్త బహుజన సమాజం సిద్ధం కావాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట స్వామి పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రౌండ్ టేండ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి,ఎస్‌టి,చేవెళ్ల డిక్లరేషన్,బీసీ కామా రెడ్డి డిక్లరేషన్, రైతు వరంగల్ డిక్లరేషన్ లన్నింటినీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొక్కిపట్టిందని, తెలంగాణ సమాజానికి ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ తుంగలో తొక్కిందని, దీనికి వ్యతిరేకంగా కూడా చలో హైదరా బాద్ కార్యక్రమంలో లక్ష లాది మంది ప్రజలను సమీ కరించి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావే



శంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ,బీసీ రాష్ట్ర నాయకుడు వైద్యుల సత్యనారా యణ,నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నేల పట్ల రమేష్ నాయి,ఎమ్మెల్సీ అభ్యర్థి ధీరావత్ రవి నాయక్,మేడి శంకర్, కొండూరు సత్యనారాయణ, గోపర్ధన్, పుట్ట బత్తుల సత్యనారాయణ,మునాస రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 15 వినతులు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సబ్ కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 15 వినతులు వచ్చినట్లు డివిజనల్ రెవెన్యూ అధికారి ఎస్.రమణా రెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్వయంగా పాల్గొని అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు సమర్పించిన వినతు లను పరిశీలించి వాటిని సంబంధిత శాఖల అధికారు లకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమర్పించిన దరఖా స్తుల వివరాలను వెల్లడిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయా నికి 4 వినతులు వచ్చాయని తెలిపారు.అదే విధంగా మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి 5 దరఖా



స్తులు అందాయని పేర్కొన్నారు. నిడమనూరు తహసీ ల్దార్ కార్యాలయానికి 2 వినతులు, వేములపల్లి తహ సీల్దార్ కార్యాలయానికి 1 వినతి, త్రిపురారం తహసీ ల్దార్ కార్యాలయానికి 1 వినతి చొప్పున అందాయని వివరించారు. వీటితో పాటు మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయానికి 1 దరఖాస్తు, అను ముల వ్యవసాయ అధికారి కార్యాలయానికి 1 దర ఖాస్తు చొప్పున ప్రజలు సమర్పించినట్లు చెప్పారు. ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ కౌన్సిలర్ పై వివక్ష తగదు



ప్రజాపక్షం/హాలియా: హాలియా మున్సిపాలిటీలో నాలుగో వార్డ్ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కడమంచి ప్రమీల పై అధికార పార్టీ నాయకులు అధికార బలం తో ఆ వార్డుకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపిస్తున్నారని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆరోపించారు. సోమవారం జడ్చర్ల కోదాడ హైవేపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని వివిధ మండలాల కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని వార్డులను అభివృద్ధి చేయాల్సి ఉండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం అందుకు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీ తరపున నాలుగో వార్డులో గెలిచిన కడమంచి ప్రమీల వార్డుకు నిధులు కేటాయిం చడంలో తీరని వివక్ష చూపిస్తున్నా రని చెప్పారు. హాలియా మున్సిపాలిటీలో సిసి రహదా రుల నిర్మాణం కోసం టి యు ఎఫ్ఐడిసి ద్వారా 3.8 కోట్లు మంజూరు అయితే కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచిన 11 వార్డుల అభ్యర్థులకు మాత్రమే ఈ నిధులు పంపిణీ చేశారని బీఆర్ఎస్ పార్టీ గెలిచిన నాలుగో వార్డుకు మాత్రం నిధులు కేటాయించలేదని తెలి పారు. పార్టీలు ముఖ్యం కాదని ప్రజలే ముఖ్యమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ బడా నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏమేర న్యాయం చేస్తున్నారో దీనిని బట్టి తెలుస్తుందని వాపోయారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ బోర్లను, విద్యుత్తును తొలగించాలి

ప్రజాపక్షం/హాలియా: ప్రభుత్వ భూమిలో అధికా రుల అనుమతి లేకుండా విచ్చలవిడిగా వ్యవసాయ బోర్లు, విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లను అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన మాజీ కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య చెరువు చలకను 27.12 ఎకరాలను కబ్జా చేసి అందులో ప్రభుత్వ అధి కారుల అనుమతి లేకుండా విచ్చలవిడిగా వ్యవసాయ బోర్లు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసుకొని అక్రమంగా సాగు చేసుకుంటున్నాడని ఫిర్యాదులు పేర్కొన్నాడు. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా వారు సదరు వ్యక్తి ఆక్రమించుకున్న భూమిని సర్వే చేసి హద్దురాళ్ళు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానీ కబ్జాదారుడు సర్వే చేసిన భూమిలో



తిరిగి వ్యవసాయం చేస్తూ బోర్లు, విద్యుత్ ట్రాన్స్ఫార్మ ర్లను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నాడని ఫిర్యాదులో చెప్పారు. అందువల్ల సంబంధిత అధికారులు కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఈ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వ్యవసాయ బోర్లను, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసు కోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అయ్యప్ప భక్త సమాజం ప్రధాన గురుస్వాముల కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణ కేంద్రంలో శ్రీశ్రీ అయ్యప్ప స్వామీ దేవాలయంలోని అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతి యేట నిర్వహించే మండల కాల దీక్షలో భాగంగా ప్రస్తుత సంవత్సరానికి అన్నదాన,గురుస్వాముల కమిటీ లను ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు మెరుగు గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అయ్యప్ప స్వామి భక్త సమాజ ఆధ్వ ర్యంలో జరిగే మండల దీక్ష,మాలధారణలు,పూజా కార్యక్రమాలు, సన్నిదానాలు,పదునెట్టాంబడి, శబరి యాత్ర వరకు మొత్తం నిర్వ హణలో మార్గనిర్దేశనం చేసేందుకు గురుస్వాముల కమిటీని ఏర్పటు చేసినట్లు చెప్పారు.తండ వెంకటేషం,బొడిగే బాబు,గంగ పురం వెంకటేశం,శెట్టి శ్రీనివాస్ ముదిరాజ్,బొడిగే లింగం, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,రేపాక జగన్,కొట్టం కరుణాకర్ రెడ్డి,అంకం మురళి, గుండు శ్రీరాములు,జితేందర్ రెడ్డి,దొంత సుద ర్శన్,చెరుకు రాజేశ్,కీర్తి సంజీవ,చేపూరి శ్రీనివాస్‌చారి,పగిడిమర్రి రాజు,నక్క శ్రీను,ఆడెపు అరవింద్,అంకం వినోద్,సాయి,సాయి ప్రకాష్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.50వేల ఆర్థిక సాయం



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన ఒక అధికార పార్టీ కార్యకర్త చేతిలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న జోగు శ్రీనివాస్‌ను పోచంపల్లి కౌన్సిలర్స్ పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.50వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజే శారు.త్వరగా కోలుకొని మంచి ఆరోగ్యంతో తిరిగి ఇంటికి చేరుకో వాలను ఆకాంక్షించారు. ఆపదలో ఉన్నప్పుడు పార్టీలకతీతంగా ఆదుకోవటం మానవతా లక్షణం అని అన్నారు.కాగా ఎమర్జెన్సీ యూనిట్ లో చికిత్స తీసుకుంటున్న బాధితుడి ప్రస్తుత స్థితికి కార ణమైన వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కిందా కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కౌన్సిలర్స్ జినుకల లావణ్య యాదగిరి ముదిరాజ్ ,పెద్దల చక్రపాణి, శ్రీరామ మంజుల లింగస్వామి యాదవ్,చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు,కూర పాటి బాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; డిగ్రి పూర్తి చేసి మూడు సంవత్సర ములు గడిచిన మండల పరిధిలోని పట్టభ ద్రులందరు ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రు లు డిగ్రి మెమో, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, పాస్ ఫోటో తో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్‌లో ఆప్లై చేసుకోవాలని సూచించారు. గత పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా ప్రస్తుతం తిరిగి మళ్ళీ అప్లై చేసుకోవాలని సూచించారు. ప్రజా స్వా మ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దరఖా స్తుకు నవంబర్ 06 చివరి తేది అని పట్టభద్రులందరు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా క్రాంతి

ప్రజాపక్షం/హాలియా: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యద ర్శిగా మారేపల్లి గ్రామానికి చెందిన మారేపల్లి క్రాంతి కుమార్ను నియమిస్తూ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు.సోమ వారం మండలంలోని మారేపల్లి గ్రామంలో నిర్వహించిన మున్నూరు కాపు సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా క్రాంతి కుమార్ ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఉద్దే శిస్తూ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన క్రాంతి కుమార్ పటేల్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకారం అందించిన జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నర్సయ్య పటేల్,రాష్ట్ర కోశాధికారి కంచి సత్య నారాయణ పటేల్, నాగార్జున సాగర్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్ పటేల్, మన్నే కృష్ణ పటేల్ ధన్యవాదాలు తెలి పారు.రాష్ట్ర,జిల్లా అధ్యక్షుల పిలుపు మేరకు మున్నూరు కాపు అభి వృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతనని అతి త్వరలో మున్నూరు కాపుల ఐక్యతకు సమావేశం నిర్వహిస్తానని తెలిపారు.



దస్రు నాయక్ సేవలు మరువలేనివి

ప్రజాపక్షం/మోతె : దస్రు నాయక్ సేవలు కాంగ్రెస్ పార్టీ ఏనాడు మరువబోదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాందాస్ తండలో ఇటీవల మరణించిన భూక్య దస్రు విగ్రహ ఆవిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పార్టీని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు. దస్రు లేని లోటు పార్టీకి కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, సీనియర్ నాయకులు మేకల గురుకృష్ణ, గ్రామ సర్పంచ్ భూక్య ఉప్పయ్య, ఉపసర్పంచ్ భూక్య నరేష్, వార్డు సభ్యులు భూక్య హుస్సేన్, రాములు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు, రహదారులపై నీరు నిలిచే అవకాశం ఉన్న నేపథ్యంలో కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల ప్రజలు, వాహన యజమానులు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని కోదాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవిఐ) జిలానీ షేక్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన అన్ని లారీ అసోసియేషన్లు, రవాణా సంస్థలు, మోటార్ క్యాబ్ యూనియన్లు, ఆటో యూనియన్లు, పాఠశాల బస్సుల యాజమానులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సిసి కెమెరాల ఏర్పాటు



ప్రజాపక్షం/అనంతగిరి: గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, దొంగతనాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు గ్రామంలో ప్రధాన కూడళ్లలో ఆలయాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎన్ఆర్ఐ బెల్లకొండ రవి ఆధ్వర్యంలో నిర్ణయించడం జరిగింది. ఈ విషయమై సోమవారం అనంతగిరి ఎస్ఐ ఏడుకొండలు తో ప్రత్యేకంగా చర్చించడం జరిగింది. గ్రామంలో వందశాతం సిసి కెమెరాల నిఘాలతోకి రాబోతుందని, గ్రామంలో ఎక్కడ ఎక్కడ సిసి కెమెరాలు పెడితే మంచిదనే అంశాలపై ఎస్ఐ సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టపల్లి నరేష్‌గౌడ్, మట్టపల్లి రామకోటయ్య, నరేష్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తున్నందున వాతావరణ శాఖ ఇచ్చిన ముందస్తు సమాచారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు హుజూర్‌నగర్ మున్సిపాలిటి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర సేవల కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, శానిటరీ, ఎలక్ట్రిషియన్లకు, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు, జేసిబి, ట్రాక్టర్లు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచామని అన్నారు.

సురక్ష ప్లస్ హోదాను సాధించేందుకు సమష్టిగా కృషి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లాకు సురక్ష ప్లస్ హోదాను సాధించేందుకు హెచ్ఎవి/ఎయిడ్స్ బృందం సమిష్టిగా, అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లాకు సురక్ష హోదా సాధించిన సందర్భంగా సోమవారం కీలక పాత్ర పోషించిన అధికారులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి నివారణ, పరీక్షలు, చికిత్స, రోగుల నిరంతరం సంరక్షణ వంటి సేవలకు మరింత బలోపేతం చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ, డిఏపి సియు, ఏఆర్‌టి కేంద్రం, సిఎస్‌సి బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య విభాగాల సమన్వయ కృషి ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ యనగందుల నాగరాజు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వి. సుధాకర్, మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ సహాయోగి రమేష్‌లను సత్కరించారు.

ప్రజావాణిలో చర్లగూడెం భూ నిర్వాసితుల ఫిర్యాదు



ప్రజాపక్షం/మర్రిగూడ : చర్లగూడెం భూ నిర్వాసితులకు వెంటనే పునరావాసం కల్పించాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.మండల పరిధిలోని శివన్నగూడెం (చర్లగూడెం)ప్రాజెక్టు నిర్మాణంలో సర్వస్వం కోల్పోయిన చర్లగూడెం గ్రామ ముంపు బాధితులకు వెంటనే పునరావాసం కల్పించి ఆదుకోవాలని రెడ్డిపల్లి సర్పంచ్ లప్పంగి నరసింహ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. ప్రాజెక్టు కోసం ఊరిని, ఇండ్లను వదులుకొని రోడ్డున పడిన తమకు ఇప్పటి వరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో బాధితులు ఎరుకలి నిరంజన్,వల్లపు హైమా భాస్కర్,బడేటి యాదయ్య పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఈ నెల 29న నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలని బీసీ జేవీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలోని హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఒకే రోజు రెండు కీలక పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నవంబర్ 29న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌తో పాటు అదే రోజు సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షను నిర్వహించేందుకు నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. రెండు పరీక్షలకు అర్హత కలిగిన అనేకమంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఒకే రోజు రెండు పరీక్షలు ఉండటంతో అభ్యర్థులు ఏదో ఒక పరీక్షకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత పరీక్షల నిర్వహణ అధికారులు నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నవంబర్ 29న జరగాల్సిన ఎస్ఐ పరీక్షను వాయిదా వేసి, మరొక తేదీని ప్రకటించాలని కోరారు.



రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

ప్రజాపక్షం/మునుగోడు :రైతులు పండించిన వరి పంటకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.సోమవారం మునుగోడు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానకాలం (ఖరీఫ్) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐకేపీ సెంటర్లలో ఉన్న వరి ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.మునుగోడు మండల వ్యాప్తంగా వరి ఎన్ని ఎకరాల్లో వేశారు,ఎంత దిగుబడి వస్తుంది, ఎల్నినో ప్రభావం వల్ల దిగుబడి తగ్గిందా,పండిన పంటకు ప్రభుత్వం నుంచి ఎంత ధర లభిస్తుంది, ప్రైవేట్ మార్కెట్లో ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు తదితర విషయాలను అధికారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జక్కలవారిగూడెం, కచలాపురం, ఊకొండి, పులిపలపుల, కలువలపల్లి గ్రామాలలో డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ఐకేపీ సెంటర్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,తహసీల్దార్ నెలపట్ల నరేష్,మండల వ్యవసాయ అధికారి పద్మజ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారబోయిన రవి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/నడిగూడెం: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని మోడల్ స్కూల్ జాయింట్ యాక్షన్ కమిటి పిలుపు మేరకు సోమవారం 4వ రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో మల్సూర్, తహసిల్దార్ కార్యాలయాల్లో తహసిల్దార్ ఎల్ మంగాకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కరివిరాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాపక్షం/నూర్యాపేట టౌన్ : కేసారం ఫేజ్2 డబుల్ బెడ్ రూం కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీ అధ్యక్షురాలు ఆశ కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో ఇప్పటి వరకు సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నీటి సమస్య కారణంగా మరికొంత మంది కుటుంబాలు కాలనీకి వచ్చి నివాసం ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసమే...



ప్రజా పక్షం/ హాలియా: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని పులిమామిడి సర్పంచ్ మాలే అరుణమ్మ అన్నారు. సోమవారం పులిమామిడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2461, కామన్ ధాన్యానికి రూ.2441,సన్నారకం ధాన్యానికి రూ.500 బోనస్ కూడా అందిస్తున్నారని చెప్పారు. అందువలన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు షూ ల పంపిణీ



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న షూలను గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌తో కలిసి విద్యార్థులకు పంపిణి చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన, విద్య అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా భాషనపల్లి మల్లయ్య

ప్రజాపక్షం/నూతనకల్ : మండలంలోని పెదనెమిల గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగా భాషనపల్లి మల్లయ్యను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కాబడిన భాషనపల్లి మల్లయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల నాయకులు గడ్డమీది వెంకటేశం, గౌడిశాల రాజమల్లు, సాయిలు, గుండగాని వెంకన్న, రమేష్, గుర్రం వెంకన్న, దూసరి అబ్బయ్య, మెల్గూరి మల్లయ్య, వెంకన్న, రేసు రామస్వామి, భాషపల్లి యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుపై జనసేన అవగాహన

ప్రజాపక్షం/చౌటుప్పల్ : ఉమ్మడి నల్లగొండవరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గదల శ్రీనివాసరావుకు మద్దతుగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జనసేన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కోసం కరపత్రాలను పంచారు.ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు ఆముదాల పరమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రవీణ్ కుమార్,పెద్దగోని లింగ స్వామి,రాజు,పల్చం శ్రీకాంత్,శ్రీనాథ్, శివ,శ్రీకాంత్, సంజయ్,తేజ,రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగమంతుల స్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రజాపక్షం/త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి, గంగ, పార్వతీ, చౌడమ్మ, పోతురాజుల నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్,పెద్దదేవులపల్లి సర్పంచ్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి,మండల బీఆర్ఎస్ నాయకులు భైరం కృష్ణ,అనుముల శ్యాం సుందర్ రెడ్డి, అనుముల సుధాకర్ రెడ్డి, చింతకాయల యాదయ్య,జంగిలి శ్రీనివాస్ యాదవ్, గోపు కోటిరెడ్డి,రాసమల్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాక్యలు చేస్తే సహించేది లేదు

ప్రజాపక్షం/చౌటుప్పల్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అనుచిత వ్యాక్యలు చేయడం తగదని కాంగ్రెస్ చౌటుప్పల్ మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు.చౌటుప్పల్ పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను అఖిలపక్షం నాయకులు సమిష్టిగా పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.ఈ విషయాన్ని తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు.ఇప్పటికైన అనవసర రాద్ధాంతం మానుకోవాలని హితువు పలికారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇప్ప వెంకటేశం,అధికార ప్రతినిధి సామకూర యాదయ్య,నాయకులు అంతటి బాలరాజు, వర్కాల కుమార్,చెరుకు లింగస్వామి,వహిద్దున్, మల్లేష్, యాదయ్య,ఐలయ్య,యాదగిరి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వినతిపత్రం



ప్రజాపక్షం/మర్రిగూడ :మండలంలోని అజిలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామం నరసింహాపురం రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డాక్టర్ మేఘావత్ చంద్రు నాయక్,జగన్ నాయక్ లు సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.అజిలాపురం గ్రామం నుంచి నరసింహాపురం మీదుగా నరసింహాపురం గేటు దగ్గర మెయిన్ రోడ్డు వరకు రోడ్డు పూర్తిగా కంకర తేలిపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2018 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.రోడ్డు లేక పోవడంతో నల్లగొండ బస్సు ఎర్రగండ్లపల్లి నుంచి అజిలాపురం,నరసింహాపురం గేటు నుంచి మాల్, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ కు చదువుల కోసం విద్యార్థులు, రైతులు వివిధ పనులకు గ్రామం నుంచి 200 మంది వరకు వెళ్తారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. నరసింహాపురం రోడ్డును బీటీ రోడ్డుగా వేయించాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు.

ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమ్మెతో వైద్య సేవలకు ఆటంకం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఏళ్ల తరబడి చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులు డాక్టర్ దయానంద్, అకౌంటెంట్ అసిస్టెంట్ కరుణాకర్, ఎంఎల్హెచ్పీ సౌమ్య, డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్ లు ప్రభుత్వాన్ని కోరారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ల్యాబ్ టెక్నీషియన్ తరాల సురేష్, డాక్టర్ వెంకటేశం,డాక్టర్ గణేష్,ఎండీ ఖలీల్, డాక్టర్ టి.రవి,ఆడియాలజీ విభాగానికి చెందిన అనిల్,బోడుపల్లి రమేష్ తో పాటు డెంటల్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోక్లతండాలో యువకుడు(మిస్సింగ్) అదృశ్యం



ప్రజాపక్షం/తుర్కపల్లి: యాదాద్రి భువనగిరిజిల్లా తుర్కపల్లి మండలం చోక్లతండా గ్రామానికి చెందిన భూక్య సంజీవ కుమారుడు భూక్య నవీన్ నాయక్ (21)అనే యువకుడు గత వారం రోజులుగా కనిపించడం లేదని తల్లిదండ్రులు తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ ఎస్సై శివకృష్ణ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం గత నెల 18 తారీకు నాడు ఇంట్లో చెప్పకుండా చోక్లతండా నుంచి, హైదరాబాద్ లింగంపల్లిలోని తన మేనమామ ఇంటికి వెళ్లాడని, 21 వ తేదీన సుమారు ఉదయం 3గంటల ప్రాంతంలో అక్కడనుండి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడని, పొద్దున్నే లేచి చూడగా నవీన్ కనిపించకుండా పోవడం, ఫోన్ చేసిన ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో వెంటనే అతని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్ని సార్లు ఫోన్ చేసిన, తెలిసిన అందరిని సంప్రదించినా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో వెంటనే భయంతో అక్టోబర్ 25వ తేదిన నవీన్ తల్లిదండ్రులు తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడం జరిగిందని, ఫిర్యాదును అందుకొని నవీన్ నాయక్ జాడ కనుక్కునే విధంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫొటోలో కనిపించే వ్యక్తి భూక్య నవీన్ నాయక్ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే వారి కుటుంబ సభ్యుల 6302326418. 8374222988. ఈ నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. నేటి యువత చిన్న చిన్న విషయాలకు, క్షణికావేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని, నవీన్ నాయక్ ఎక్కడున్నా మీ కుటుంబాన్ని చేరుకోవాలని ఎస్సై శివకృష్ణ కోరారు.

మున్సిపాటీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు



ప్రజాపక్షం/చండూరుః మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చండూరు మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మున్సిపాలిటీ పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కస్తాల రోడ్డులో వాసవి మాత దేవాలయం వరకు నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిసిరోడ్డు నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ పాలకవర్గం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ పట్టణంలో మౌళిక వసతుల కల్పనకు ప్రధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించెందుకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారిగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, బుషిపాక వాసు, కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాతజనార్దన్ , కటకం రమేష్ ,షేక్ ఖలీల్ , మొగుదాల సత్తమ్మ వెంకన్న , కాంగ్రేస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేశం పాల్గొన్నారు.



ప్రజావాణికి ఒక దరఖాస్తు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ఒక దరఖాస్తు వచ్చిందని అధికారులు తెలిపారు. సోమవారం మిర్యాలగూడ మండలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తు వచ్చిందని నోడల్ అధికారి శేషగిరి శర్మ తెలిపారు.ఆ దరఖాస్తును మండల పంచాయతీ అధికారికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శేషగిరి శర్మ, తహసీల్దార్ శ్రీనివాస శర్మ, వెటర్నరీ డాక్టర్ స్వరూప, వ్యవసాయ అధికారి రుసేంద్రమణి, మండల విద్యాధికారి ధర్మానాయక్, పీహెచ్సీ ఆలగడప డాక్టర్ మోయిద్, ఆర్డబ్ల్యూఎస్ మణిదీప్, ఇరిగేషన్ ఏఈ మానస, బీసీ వార్డెన్ రాకేష్, ఎస్ సీ వార్డెన్ సావిత్రి, ఎస్ టీ హాస్టల్ వార్డెన్ సాయి రాములు, ఏపీఓ లు దిలీప్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

గంధమల్లలో కోతుల సమస్య



ప్రజాపక్షం/తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో చాలా గ్రామాల్లో కోతుల సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది, ముఖ్యంగా మండలంలోని గంధమల్ల గ్రామంలో తీవ్రతర మవుతున్న కోతుల సమస్య అంత ఇంత కాదు. పాటశాలల్లో చదివే విద్యార్థులు, వృద్ధులు, గ్రామ ప్రజలు నిత్యం కోతుల దాడులతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ పైన వాటర్ ట్యాంకులపై చెట్లపై నుండి దూకుతున్న కోతులు వాటర్ ట్యాంకులలోని నీటిని పాడు చేస్తున్నాయని, అందుకు రక్షణగా కంప పెట్టడం జరిగిందని వాపోతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే కోతుల సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు, పాటశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కోరుతున్నారు.

రెండు జాతీయ అవార్డులు

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వంగాల గ్రామ మాజీ సర్పంచ్, ప్రముఖ సామాజిక సేవకులు, దళిత రత్న అవార్డు గ్రహీత పాల అబ్బులు రెండు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమి(బి. ఎస్.ఏ) జాతీయ కమిటి ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సర్పంచ్, ఉత్తమ సోషల్ వర్కర్ జాతీయ అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 15న న్యూఢిల్లిలో ఈ అవార్డుల ప్రధానోత్సవం జరగనున్నట్లు అకాడమి ప్రకటించింది. ప్రజా సేవకు దక్కిన జాతీయ గుర్తింపు, సామాజిక ఉద్యమ ప్రస్తానానికి మరో మైలు రాయి అని పలువురు కొనియాడారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అరెస్టులా



ప్రజాపక్షం/నకిరేకల్ :ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి మేలు చేయడం లేదని ప్రశ్నిస్తే అరెస్టులు,నిర్బంధాలు,దేశద్రోహులు,అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేధిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు యారా శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టనున్న సందర్భంగా సోమవారం యారా శ్రీనును నకిరేకల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అరెస్టులతో ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని ఆరోపించారు.మోదీ,అమిత్ షా దేశ ప్రజల సొమ్మును లక్షల కోట్లు అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ సామాన్య ప్రజలకు నిత్యావసర సరుకులపై సుంకాలు విధించి ధరలు పెంచి నడ్డి విరుస్తున్నారని అన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/చండూరు: ఎలనినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన కరువు యాత్రలో భాగంగా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలో ఎండిపోయిన వరి పంట పొలాలను సిపిఐ బృందం పరిశీలించింది. గ్రామానికి చెందిన రైతులు సుంకరి లింగయ్య శాంభవి,సుంకరి రాములు సాగు చేసిన పంట పొలాలను సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి,జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు సందర్శించి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను, ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చండూరు మండలంలో 28 వేల ఎకరాలకు పైగా పత్తి, 2,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారని తెలిపారు.బంగారుగడ్డ గ్రామంలో 2,098 ఎకరాల్లో పత్తి, 168 ఎకరాల్లో వరి సాగు చేయగా,వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య,తీర్వారి వెంకటేశ్వర్లు,మాజీ జెడ్పీటీసీ మాధవని విజయలక్ష్మి, మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, బండ మీది వెంకన్న,గంట రమేష్,ఇరిగి సంజీవ,పల్లె శంకరయ్య,మాజీ సర్పంచులు బోయపల్లి జంగయ్య, బోయపల్లి బిక్షమయ్య,జోగు రమేష్,లింగయ్య,తలారి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తూ

ప్రజాపక్షం/చండూరుః చండూరు ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒకేఒక దరఖాస్తూ రావడం జరిగిందని ఎంపిడిఓ బండారు యాదగిరి తెలిపారు. చండూరు మున్సిపాలిటీకి చెందిన మహిళ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తూ పెట్టుకున్నారు. ఈ కాఱ్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్ శర్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దేవాలయ ప్రారంభోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరణ



ప్రజాపక్షం/చండూరుః చండూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ బ్రోచర్‌ను సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి , కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మీ ఆవిష్కరించారు. శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడి లక్ష్మీ దంపతులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , కోడి వెంకన్న, కాంగ్రేస్ చండూరు పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేశం , రాంమూర్తి , పన్నాల లింగయ్య , ఆర్ వెంకటేశ్వర్లు, రాపోలు సత్యనారాయణ , ప్రసన్న, వెంకటేశం , సముద్రాల వెంకన్న పాల్గొన్నారు.

గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాపక్షం/అడ్డగూడూరు: వరంగల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు కొల్లూరి బన్నివిశాల్, పైస మధుతో పాటు మైనర్ బాలుడు పైస మధు ఆటోలో 90గ్రాముల గంజాయితో ప్రయాణిస్తుండగా బొడ్డుగూడె టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గత నెల 30వ తేదిన పట్టుబడ్డారు. వారిని విచారించగా గంజాయి విక్రయించిన నల్లగొండ ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థి వసుకుల మణిదీప్‌ను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రామన్నపేట కోర్టులో మెజెస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. గంజాయికి అలవాటుపడ్డ విద్యార్థులు ముగ్గురిని తదుపరి విచారణ పూర్తయిన వెంటనే కోర్టులో హాజరుపరుస్తామని అడ్డగూడూరు ఎస్సై వెంకట్ రెడ్డి తెలియజేసారు.

ఘన సన్మానం

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు సోమవారం ఘన సన్మానం లభించింది.తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల బృందంతో కలిసి ఫిన్లాండ్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి పాఠశాలకు వచ్చారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి శారద ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన రెండు పడకల గదుల ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్ నగర్‌లో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న ఇళ్ల పంపిణీ సభ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తారని తెలిపారు. సభకు విచ్చేసే మంత్రులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సభా ప్రాంగణ నిర్మాణం, వేదిక సమకూర్చడం, వాహనాల పార్కింగ్ స్థలాలు, మంచినీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల పంపిణీ ప్రక్రియ ఎంతో పారదర్శకంగా, సజావుగా సాగేలా చూడాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉండే అవకాశం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ ః బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుఫాను ప్రభావం సూర్యాపేట జిల్లాపై ఉండే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. జిల్లాలో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతోపాటు క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ అత్యవసర వెబెక్స్ సమావేశం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, అర్ధరాత్రి 55 నుంచి 65 కిలో మీటర్లు, మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.

24 గంటలు అందుబాటులో అధికారులు...

రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయితీ రాజ్, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, కట్టలు, కాల్వల నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రోడ్లపై చెట్లు కూలినా, వరదలతో రాకపోలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేందుకు జెసిబిలు, ఇసుక బస్తాలు, ఇతర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలన్నారు. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

గంటగంటకు పరిస్థితిపై నివేదిక...

జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కీలక శాఖ నుంచి ఒక అధికారిని కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గంటకు పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, వెంకటరమణ, డిఈఓ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ డిడి శ్రీనివాసరావు, డిఎస్ఓ మోహన్ బాబు, ఆర్‌డిఓ పురుషోత్తం రెడ్డి, డిఐఈఓ సులోచన రాణి, ఆడిట్ ఆఫీసర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి): ఈ నెల 15న ఎన్జీ కాలేజీలో లక్ష మంది రైతులతో బహిరంగ సభ ఉంటుందని, అలాగే 14వ తేదీ నుంచి గడియారం సెంటర్ లో రైతు అగ్రి షో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నామని రైతు సంఘం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, చింతపల్లి బయన్న తెలిపారు.మండలంలోని బొరవాణి గ్రామంలో రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.నవంబర్ 15వ తేదీన నల్లగొండ ఎన్జీ కాలేజీలో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకు పెద్దు లు,కుమ్మరి శంకర్,దండు రవి,ఆమనగంటి ఐలయ్య,కల్లూరి కంఠమహేశ్వర్, కృష్ణారెడ్డి, నాగచారి,నరసింహ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/తుర్కపల్లి: తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004/05 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పలుగుల మైసమ్మ దేవాలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 22 సంవత్సరాల తర్వాత ఓకే వేదికపై అందరూ కలుసుకొని స్నేహితులు తాము చదువుకున్న రోజులను, మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 22 సంవత్సరాల సంవత్సరాల క్రితం పదవ తరగతిలో చేసిన అల్లరి, ఆడుకున్న ఆటలు, చదువుకున్న చదువులపై ఒకరినొకరు నెమరేసుకుని ఆనందోత్సవాల మధ్య పలకరించుకున్నారు.

బిఆర్ఎస్ హయంలోనే అభివృద్ధి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : బిఆర్ఎస్ హయంలోనే మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బిఆర్ఎస్ నాయకులు,సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి,మండల అధ్యక్షులు గిర్కంటి నిరంజన్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు బోమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి లు అన్నారు.సోమవారం బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం, మునిసిపాలిటీగా మార్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దని అన్నారు. ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి శూన్యమని తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కౌన్సిలర్ కొయ్యడ శేఖర్, ఊదరి యాదయ్య, నాయకులు తాడూరి పరమేష్,ఉడుగు మల్లేష్,ఢిల్లీ మాధవరెడ్డి, చిన్నం బాలరాజు, కానుగు శివ, శివగోని మహేష్, యాట యోగానందం తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎండిపోతున్న పంటలను పరిశీలించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/డిండి: వర్షాభావ పరిస్థితులతో నల్లగొండ జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని,పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నల్లగొండను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన కరువు యాత్రలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా డిండి మండలం రామంతాపురం గ్రామంలో ఎండిపోతున్న వరి పంట పొలాలను పల్లా వెంకట్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పరిశీలించారు. పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సాగు కోసం చేసిన పెట్టుబడులు,అందుబాటులో ఉన్న నీటి వనరులు, బోర్లు, బావుల్లో నీటిమట్టం,విద్యుత్ సరఫరా,పంటల దిగుబడిపై పడుతున్న ప్రభావం తదితర అంశాలపై వివరాలు సేకరించారు.

ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి నల్లగొండను పూర్తిస్థాయి కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని,పంటల బీమా పరిహారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని కోరారు.రైతులపై రుణభారం మరింత పెరగకుండా వ్యవసాయ రుణాల వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేసి రుణ ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ మైనోద్దీన్,సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి,మండల సహాయ కార్యదర్శులు తిప్పర్తి విజేందర్‌రెడ్డి,బొల్లె శైలేష్,మండల కార్యవర్గ సభ్యులు ఎలిమినేటి హుస్సేన్,నూనె వెంకటేశ్వర్లు, సోమిడి శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్,శాఖ కార్యదర్శులు చక్రి,శ్రీను, రైతులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/గుండాల; మానవ సేవే మాదవ సేవా అనే నినాదంతో ముందుకు వెళుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ మబ్బు మహేష్ చేస్తున్న సేవలు వేలకట్టలేనివని ఇందులో భాగంగానే గుండాల మండల పరిధిలోని గంగాపురం గ్రామానికి చెందిన అల్వాల గణేష్ గుండెపోటుతో మృతి మరణించగా, వస్తాకొండూరు గ్రామానికి చెందిన ఇందిరాల నాగయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో సోమవారం వారి కుటుంబాలను మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి ఒక్కో కుటుంబానికి రూ. 5వేలను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కాళి మంజుల ఆంజనేయులు, పిట్టల హేమలత పూర్ణ చందర్, లావణ్య లవకుమార్, శ్రీనివాస్, వార్డు సభ్యులు యాదగిరి, గణేష్, రవి, వెంకటయ్య, సంతోష్‌రెడ్డి, మదర్, నరసింహారెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిసిస భక్తులతో లక్ష బిళ్వార్చన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పట్టణంలోని మార్కెండేశ్వర స్వామి భజనమండలి స్వర్ణోత్సవాలో భాగంగా సోమవారం దేవాలయంలో పుండరీక భక్త పేవా సమాజం ఆధ్వర్యంలో లక్ష బిళ్వార్చన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.రెండో రోజు ఉదయం రుదాభిషేకం సీతారామచంద్రస్వామి పూజ,భ్రమరాంబ దేవి కుంకుమార్చన ఆంజనేయ స్వామి అభిషేకం నవగ్రహ పూజ పాండురంగ స్వామి పూజ,యజ్ఞం నిర్వహించారు.మధ్యాహ్నం భజనలు చేసారు.రాత్రి పరిశుద్ధానందగిరి స్వామిజి ప్రవచనాలు చేశారు.

కరువు రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

వరికి ఎకరాకు రూ.30 వేలు,పత్తి ఇతర పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి పల్లా వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/నాంపల్లి: కరువు పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాకాలంలో రైతులు సాగు చేసిన వరి, పత్తి తదితర పంటలు ఎండిపోవడంతో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా గుర్తించి రూ.30 వేల కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన కరువు యాత్రలో భాగంగా నాంపల్లి మండలం నరసింహులగూడెం గ్రామంలో ఎండిపోయిన వరి, పత్తి పంటలను పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం తదితర నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎలొనినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ బియ్యం పంపిణీపై కూడా వారు స్పందిస్తూ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.100 వరకు పలుకుతోందని,ప్రభుత్వం మాత్రం కిలో రూ.66కే అందిస్తున్నట్లు చెబుతోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఈ పథకం అమలు తీరును పరిశీలించాలని, రేషన్ కార్డుదారులం దరికీ 10 కిలోల బియ్యం పంపిణీ చేయాలని కోరారు. రైతులతో పాటు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వర్షాకాలంలో సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీలు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులపై అపరాధ వడ్డీల భారం పడకుండా చర్యలు తీసుకోవాలని,పాత రుణాల విషయంలో వెనులుబాటు కల్పించి తిరిగి కొత్త రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మునుగోడు, దేవరకొండ ప్రాంతాలు ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్నాయని, కృష్ణా జలాలు అందకపోతే ప్రజలు కలుషిత నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్య చారి,తిర్పురివెంకటేశ్వర్లు ,మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్,మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, ఊరుపాక వెంకటయ్య,నేరెళ్ల సైదులు,గిరి స్వామి,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెన్నోజు వెంకటాచారి,స్థానిక సర్పంచ్ బీసు అరుణ, శ్రీశైలం,ఉపసర్పంచ్ జాల మహేష్,గ్రామ శాఖ కార్యదర్శి జెట్టి కృష్ణ, సుంకరి లింగయ్య,కాటం లింగయ్య,జెట్టి వెంకటయ్య, చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/తుర్కపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 15 నుండి 18 వరకు నిర్వహిస్తున్న అఖిల భారత రైతు సంఘం (AIKS) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ సోమవారం పిలుపునిచ్చారు. మహాసభల తొలిరోజైన నవంబర్ 15న నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, కౌలుదారులు, వ్యవసాయ కార్మికులు, పెద్ద ఎత్తున తరలి రావాలని అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని రైస్ మిల్లు వద్ద రైతు సంఘం ఆలిండియా మహాసభల జయప్రదం కోరుతూ నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం నిరంతరం దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్న అఖిల భారత రైతు సంఘం నల్లగొండ జిల్లా కేంద్రంలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తలారి మాతయ్య, సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశం, రైతులు జనార్దన్ రెడ్డి, గడ్డి నరసయ్య, సుధీర్ గుండెబోయిన బాలయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగలకు రెండేళ్ల జైలు శిక్ష

12 బైకుల దొంగతనం కేసుల్లో నిందితులుగా గుర్తింపు

ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల, ఇతర పోలీస్ స్టేషన్‌ల పరిధిలో బైక్‌ల దొంగతనాలకు పాల్పడిన కేసులో ఇరువురు వ్యక్తులకు నల్లగొండ జిల్లా జైలు రెండు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించింది. స్థానిక ఎస్ఐ బి వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నీలపు నీలయ్య(26), బత్తిని నరేష్ అలియాస్ లవ్లీ నరేష్(29)లు చిట్యాల పరిధిలో ఒక బైక్ దొంగతనం చేసి స్థానిక పోలీసులకు పట్టుపడ్డారు. విచారణలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మరో 11 బైక్‌లను దొంగిలించినట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేయగా విచారణ అనంతరం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. నిందితులకు శిక్షపడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు ఈ సందర్భంగా అభినందించారు.